# అనుభవాలను అక్షరబద్ధం చేయాలి



దల్లాస్ : మన అనుభవాలు, జ్ఞాపకాలను తెలుగులో అక్షరబద్ధం చేయాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని డాక్టర్ విష్ణుభొట్ల లక్ష్మన్న పేర్కొన్నారు. అమెరికాలోని తెలుగు రచయితలు ఇక్కడి సమాజాన్ని మరింత లోతుగా, విస్తృతంగా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ఉద్యోగ రీత్యా తాను ఫ్రాన్స్‌లో ఉన్న సమయంలో కలిగిన అనుభవాలు, మాతృభాషపై మమకారాన్ని ఎలా పెంపొందించాయో ఆయన వివరించారు. ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా - టాన్‌టెక్స్) నిర్వహించిన 'నెల నెలా తెలుగు వెన్నెల' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తన ప్రసంగం చివరిలో ఘంటసాల మధురగీతాలు ఆలపించిన లక్ష్మన్న వేణుగానంతో కూడా ప్రేక్షకులను పరవశింపజేశారు. నవంబర్ 16న దల్లాస్ నగరంలోని అవర్ ప్లేస్ రెస్టారెంట్‌లో ఈ సాహిత్య కార్యక్రమం ఘనంగా జరిగింది. లక్ష్మన్నను తానా కార్యదర్శి తోటకూర ప్రసాద్ సభకు పరిచయం చేశారు.



ఈ సమావేశానికి కన్నెగంటి చంద్ర స్వాగతం పలికారు. ప్రస్తుతం అమెరికా మొదలు ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న ఆర్థిక సంక్షోభానికి అద్దం పట్టినట్లుగా నందివాడ ఉదయభాస్కర్ స్వీయ కవిత 'ఆకుల్లేని చెట్టు' చదివారు. కన్నెగంటి మంజులత తనకు నచ్చిన కవిత శీర్షికన కె.శివారెడ్డి రాసిన 'వృద్ధాప్యం' కవితను వినిపించారు. వార్తా పత్రికలు, టీవీలలో వినియోగిస్తున్న తెలుగు పదాలపై చేకూరి కోటేశ్వరరావు చక్కని విమర్శనాత్మక ప్రసంగం చేశారు. అమెరికాలోని తెలుగు కుటుంబాల పిల్లలకు తెలుగును నేర్పించాలని తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆవుల మంజులత విజ్ఞప్తి చేశారు. 'వీరగంధము తెచ్చినారము' గేయాన్ని మల్లవరపు అనంత్ ఆలపించారు. ఆళ్ళ శ్రీనివాసరెడ్డి సినీగీతం పాడారు. తెలుగు భాష పుట్టు పూర్వోత్తరాల గురించి తారా కుమార్ రెడ్డి ప్రసంగించారు. పుదూర్ జగదీశ్వరన్ పద్య పఠనం చేశారు.

ముఖ్య అతిథి డాక్టర్ విష్ణుభొట్ల లక్ష్మన్నకు తెలుగు సంఘం అధ్యక్షురాలు రుమాళ్ళ శ్యామ పుష్పగుచ్ఛం అందించగా పులిగండ్ల విశ్వనాథ శాలువ కప్పి సన్మానించారు. మల్లవరపు అనంత్ జ్ఞాపిక ఇచ్చి వందన సమర్పణ చేశారు. ఈ సాహితీ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అవర్ ప్లేస్ రెస్టారెంట్ అల్పాహారం అందజేసింది.